www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 22 జూన్ 2023
5
పశ్చిమ గోదావరి

జగనన్న సురక్షను వినియోగించుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జులై 1వ తేదీ నుంచి అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ క్యాంపుల్లో ప్రధానంగా 11 రకాల సేవలు, ధ్రువీకరణ పత్రాల జారీకి ఎలాంటి సర్వీసు ఛార్జీలూ వసూలు చేయకూడదని నిర్ణయం తీసుకుందని తెలిపారు. నాలుగు వారాల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుతుందని తెలిపారు. 'జగనన్నకు చెబుదాం'కు అనుబంధంగా అన్ని రకాల ప్రజల వినతులను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. తహశీల్దార్, ఎంపిడిఒలతో సహా వివిధ మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో జులై 1 నుంచి సచివాలయాల వారీగా ఈ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు.

పరిహా(స)రం..!

కుక్కునూరు,వేలేరుపాడు మండలాల్లో వరద బాధితుల పరిస్థితి దయనీయం

ఏడాదైనా అందని వరద సాయం

అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల వైఫల్యంపై సర్వత్రా ఆగ్రహం

ఇల్లు కోల్పోయి ఇప్పటికీ పునరావాస కేంద్రాల్లోనే ఆవాసం

పట్టించుకునే నాధుడే కరువాయే

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. వరదలకు సర్వంకోల్పోయి రోడ్డున పడ్డ నిర్వాసితులపట్ల కనీసం కనికరం లేకుండా పోయింది. ఏడాది గడుస్తున్నా వారికి వరదసాయం నేటికీ అందలేదు. వరదలకు ఇళ్లు కుప్పకూలిపోవడంతో ఇప్పటికీ అనేకమంది పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. వరదలకు సర్వం కోల్పోయిన పోలవరం నిర్వాసితులకు వరదసాయం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యమా.. పాలకుల వైఫల్యమో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

గతేడాది జులైలో గోదావరి వరద బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. గోదావరి వరదల వల్ల కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వేలాది మంది నిరాశ్రయులయ్యారు. గతంలో ఎన్నడూలేనంతగా గోదావరికి వరదలు వచ్చిపడ్డాయి. భద్రాచలం వద్ద నీటిమట్టం 71.5 అడుగులు చేరుకోవడంతో పోలవరం విలీన మండలాల్లో ప్రతి గ్రామం వరదముంపులో విలవిల్లాడింది. వరద ప్రళయానికి కట్టుబట్టలతో చెట్టుకొకరు, పుట్టకొక్కరు అన్నట్లు పరిస్థితి తయారైంది. విలీన మండలాల్లో ప్రజలకు గోదావరి వరదలు కొత్తేమీ కాదు, 1986లో వచ్చిన గోదావరి వరదల స్థాయిలో గతేడాది వరద ముంచెత్తింది. ప్రతీ గ్రామంలో 50 శాతం ఇళ్లు వరదలకు కొట్టుకుపోవడం, కూలిపోవడం జరిగింది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు ఎనిమిది వేలకుపైగా ఇళ్లు నేలమట్టమైనట్లు అధికారులు తేల్చారు. వరద బాధితులను పరామర్శించేందుకు వేలేరుపాడు మండలంలో సిఎం జగన్ పర్యటించారు. ఈ సందర్భంగా వరదలకు సర్వం కోల్పోయిన బాధితులకు వెంటనే పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దెబ్బతిన్న ఇళ్లకు రూ.పది వేలు ఇస్తామని తెలిపారు. ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ ఇంటి నష్ట పరిహారం కోసం వరద బాధితులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కుక్కునూరు మండలంలో ఒకరిద్దరికి మాత్రమే ఇంటి నష్ట పరిహారం అందింది. కుక్కునూరు 'ఎ' బ్లాక్‌లో 95 శాతం మందికి, బెస్తగూడెం గ్రామంలో ఎస్‌సి కాలనీలో 369 కుటుంబాలకు, కివ్వాక, మారేడుబాక, వింజరం, కౌండిన్యముక్తి, ఎల్లప్పగూడెం, సీతారామనగరం వంటి గ్రామాల ప్రజలకు వరద సాయం అందలేదు. వీరంతా ఇప్పటికీ సాయం కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు.

గత ఏడాది వరదలకు కుప్పకూలిన ఇళ్లు (ఫైల్‌ఫొటో)

ఇప్పటికీ పునరావాస కేంద్రాల్లోనే

వరదలకు సర్వం కోల్పోయిన వరద బాధితులు ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ పునరావాస కేంద్రాల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. కుక్కునూరు 'ఎ' బ్లాక్‌కు చెందిన 200 కుటుంబాలకు చెందిన ఇళ్లు పూర్తిగా వరదలకు కుప్పకూలిపోయాయి. ఏడాది నుంచి ఇల్లు లేక కివ్వాక పునరావాస కేంద్రాల్లోనే జీవిస్తున్నారు. ఇక్కడ ఉండటం వల్ల ఉపాధి లేక రోజు గడవక వారి పరిస్థితి దయనీయంగా తయారైంది. వరద బాధితులంతా రెక్కాడితే కానీ డొక్కాడని సాధారణ ప్రజానీకమే. కూలి, నాలి చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే పరిస్థితి. ఏడాది పాటు గ్రామానికి దూరంగా ఉన్న పునరావాస కాలనీలో జీవించడంతో కూలిపనులు కూడా దొరకటంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద బాధితులు ప్రస్తుతం తలదాచుకుంటున్న పునరావాస కాలనీ ఆ ప్రాంత గిరిజనుల కోసం ప్రభుత్వం నిర్మిస్తోంది. దీంతో ఎప్పుడు ఖాళీ చేయమంటారోనని అంతా తీవ్ర ఆందోళనతో కాలం వెళ్లదీస్తున్నారు. అదే జరిగితే ఎక్కడికెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొందని బాధితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గోదావరి వరదల వల్ల నష్టపోయిన బాధితులకు పరిహారం చెల్లించాలని, అదేవిధంగా పోలవరం నిర్వాసితులమైన తమకు రావాల్సిన పూర్తి పరిహారం ఇచ్చి తమను ఆదుకోవాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు.

మళ్లీ ముంచేస్తారా

విలాసాగరపు రాంబాబు, మసీదు సెంటర్, కుక్కునూరు

గోదావరి వరదలు వచ్చే సమయం దగ్గర పడుతుండటంతో భయం భయంగా గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుక్కునూరుకు చెందిన నా ఇల్లు, నా కుమారుడి ఇల్లు రెండూ వరదల్లో కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదు, ఏటా ఈ బాధలు పడలేము. ఈ బాధలు ఎవ్వరికీ రాకూడదు. మళ్లీ గోదావరిలో ముంచేలానే ఉంది పరిస్థితి.

ఏడాది గడిచినా ఇంటి నష్ట పరిహారం అందలేదు

ఎన్.మహేష్. కుక్కునూరు, రజక బజార్

గతేడాది వచ్చిన గోదావరి వరదలకు రజక బజారులోని మా ఇల్లు పూర్తిగా పడిపోయింది కట్టుబట్టలతో సురక్షిత ప్రాంతాలకు వెళ్లి తలదాచుకున్నాం. బార్బర్ షాపుపైనే ఆధారపడి భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాను. ఇల్లు కట్టుకునే స్తోమత లేక పడిపోయిన ఇంటినే బాగుచేసుకుని ఉంటున్నాను. ఏడాది గడిచినా ఇంటి నష్ట పరిహారం అందలేదు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి.

నాడు-నేడు పనులు నాణ్యంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గుడ్లు పరిశీలిస్తున్న కలెక్టర్

వెంకటరామన్నగూడెం, వీరంపాలెం, అప్పారావుపేట, ఆరుగొలను పాఠశాలల్లో నాడు - నేడు పనులను కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అలాగే పట్టణంలోని నూతన ఆర్‌డిఒ కార్యాలయ భవనం, వీరంపాలెంలో అంగనవాడీ కేంద్రాన్ని, ఆరుగొలను గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నాడు - నేడు పనులు జరుగుతున్న పాఠశాలలను కలెక్టర్ పరిశీలించి ఇప్పటివరకూ చేసిన ఖర్చులకు సంబంధించి బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సంబంధిత శాఖ అధికారులకు కలెక్టరు సూచించారు. నాడు-నేడు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. టాయిలెట్స్, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. వారంలో రెండు రోజులు పాఠశాలలు, కళాశాలలు తనిఖీలు చేసి పరిసరాలను ఆర్‌అండ్‌బి అధికారులు పరిశీలించాలన్నారు. ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సెక్రటరీ వారంలో రెండు రోజులు విధిగా పాఠశాలల్లో తనిఖీలకు వెళ్లాలని, వారు తనిఖీకి వెళ్లిన వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టరు ఆదేశించారు. వీరంపాలెం గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాకు రిజిష్టర్‌ను పరిశీలించారు. కోడిగుడ్డు సైజును పరిశీలించి నిర్ణీత బరువు ఉన్నదీ లేనిదీ తూకం వేయించారు. ఎంత మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్ల వివరాలను తెలుసుకున్నారు. చిన్నారులకు అర్థమయ్యే రీతిలో విద్యాబుద్ధులు నేర్పించాలని ఆమె సూచించారు. నేటి బాలలే రేపటి పౌరులని, చిన్నారులను తమ సొంత బిడ్డల్లా చూసుకోవాలని ఐసిడిఎస్ సిబ్బందికి కలెక్టరు సూచించారు. చిన్నారులను కొన్ని ప్రశ్నలు వేసి ఆమె సమాధానాలు రాబట్టారు. అనంతరం ఆరుగొలను అంబేద్కర్ గురుకుల పాఠశాల నూతన భవనాన్ని కలెక్టరు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ఈ వారంలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి ఆర్ వెంకట రమణ, ఐసిడిఎస్ అధికారి బి.సుజాతారాణి, తహశీల్దారు వైకెవి.అప్పారావు, ఎంపిడిఒ విశ్వనాథం, ఎంఇఒ హనుమ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ, ఐసిడిఎస్ సిబ్బంది, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం మున్సిపల్ కార్యాలయంలోనే దళితులపై కులవివక్ష చూపిన మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఎస్.శివరామకృష్ణ సాక్షాత్తు మున్సిపల్ కార్యాలయంలోనే కుర్చీలో కూర్చున్న దళితులను బలవంతంగా లేపి బయటకు గెంటించడం దారుణమన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ ఇడి పట్ల కమిషనర్ వ్యవహరించిన తీరు అమానుషమన్నారు. శివరామకృష్ణ తన ఆధిపత్య కులదురహంకారంతో మున్సిపల్ కార్యాలయాన్ని కుల ఆధిపత్యానికి అడ్డాగా మార్చారని మండిపడ్డారు. క్రిందిస్థాయి నుంచి ఉన్నతోద్యోగుల వరకూ వారి పట్ల కూడా కమిషనర్ కుల అహంకారంతో వ్యవహరించారని గుర్తుచేశారు. మెప్మా అధికారులతో దళితులను బయటికి గెంటించడం దారుణమన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నిరంతరం శునకాలు నివసిస్తున్నా పట్టించుకోని కమిషనర్ దళితులు కుర్చీలో కూర్చుంటే ఒప్పుకోకపోవడం తన అహంకారానికి ప్రతీక అని అన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి పట్ల కూడా కులవివక్ష చూపడం సభ్య సమాజం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఒ, డిఎస్‌పిలకు విన్నవించుకున్నా ఇప్పటివరకూ పట్టించోకపోవడం దారుణమన్నారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదుకు ఫిర్యాదు చేసి వారం రోజులు దాటుతున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కమిషనర్‌పై కేసు నమోదుకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. పట్టణంలో ఇటీవల కాలంలో జరిగిన అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయని గుర్తుచేశారు. కమిషనర్ శివరామకృష్ణ కేవలం అవినీతి అధికారి మాత్రమే కాదని కుల అహంకారి కూడా అని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నా కుర్చీలో కూడా కూర్చోనివ్వకుండా దళితుల ఆత్మ గౌరవాన్ని అవమాన పరిచిన కమిషనర్‌పై తక్షణం ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

తాడేపల్లిగూడెం ఎంఇఒ-2గా జ్యోతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం మండల విద్యాశాఖాధికారి-2గా పిఎంకె.జ్యోతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కాస్ప పెంటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం ఎంఇఒ-2గా విధుల్లో చేరారు.

బాధలు వింటూ.. భరోసా ఇస్తూ...

రెండో రోజు ఉత్సాహంగా సాగిన మహాపాదయాత్ర

ప్రజాశక్తి- కూనవరం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో చేపట్టిన నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్ర రెండో రోజు బుధవారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. అడుగు అడుగునా హారతులతో పాదయాత్రకు ముంపు గ్రామాల ప్రజలు స్వాగతం పలికారు. పాదయాత్ర బృందం మండుటెండను సైతం లెక్క చేయకుండా కొనసాగించింది. మురుమూరు గ్రామంలో 'ఉపాధి హామీ' పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. కూలీలతో కలిసి వి.శ్రీనివాసరావు గునపం పట్టారు. పాదయాత్రకు కాచవరంలో వైసిపి నాయకులు, దూగుట్టలో టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. దూగుట్ట గ్రామంలో ప్రజలతో శ్రీనివాసరావు మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాచవరం ఎస్‌సి కాలనీ వాసులు తమకు వరద ముంపు సమయంలో నిత్యావసరాలు ఇవ్వలేదని పాదయాత్ర దృష్టికి తెచ్చారు. పోలిపాకలో గోదావరి ముంపులో తమ గ్రామం ఉన్నా ముంపులో లేదని అధికారులు చెపుతున్నారని స్థానికులు వాపోయారు. కూళ్లపాడులో ఆ గ్రామానికి చెందిన మడకం లక్ష్మి తన సమస్యలను తెలియజేసింది. గత ఏడాది ముంపునకు గురై తన ఇల్లు పాడైందని, ప్రభుత్వం ఎటువంటి సహాయం అందించలేదని తెలిపింది. వరదల్లో మునిగి ఉన్న నిర్వాసిత ప్రాంత ప్రజలను వైసిపి ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏనాడూ పట్టించుకోలేదని నాయకులు విమర్శించారు. సిపిఎం మాత్రం ఎప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి నిర్వాసితునికీ న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.



మురుమూరు గ్రామాన్ని 41 కాంటూరులో కలపాలని వినతిపత్రం ఇస్తున్న ఆ గ్రామస్తులు



ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

రెండో రోజు పాదయాత్ర సాగింది ఇలా...

రెండో రోజు బుధవారం ఉదయం ఎటపాక మండలం మురుమూరులో ప్రారంభమై కూనవరం మండలంలోకి ప్రవేశించి పోలిపాక, పోచవరం కాలనీ వరకు సాగింది. అక్కడ ఉదయం అల్పాహారం అనంతరం పోచవరం, కాచవరం, దూగుట్ట మీదుగా కూళ్లపాడుకు మధ్యాహ్నం సమయానికి చేరుకుంది. అక్కడ మధ్యాహ్నం భోజనాలు చేశారు. అక్కడ నుండి నర్సింగపేట, పొట్లవాయిగూడెం, కరక గూడెం, కొండాయి గూడెం, గొమ్ముగూడెం జంక్షన్ మీదుగా పల్లూరు వరకు సాగింది. సాయంత్రం అక్కడ ఆవుల నాగమయ్య స్థూపానికి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం స్థూపం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. అనంతరం మర్రిగూడెం, చూచిరేవుల గూడెం, భీమవరం, జగ్గవరం, మీదుగా రాత్రికి టేకులబోరు గ్రామానికి చేరింది. అక్కడ రాత్రి భోజనం చేసి బస చేశారు.

కాళ్లకు చెప్పులు లేకుండా 15 కిలో మీటర్ల నడక

సిపిఎం చేపట్టిన పాదయాత్రలో ఓ బాలిక కాళ్లకు చెప్పుల్లేకుండా 15 కిలోమీటర్లు నడిచింది. మంగళవారం ఎటపాక మండలం నెల్లిపాకలో పాదయాత్ర ప్రారంభం కాగా, అక్కడ నుండి తొలిరోజు పాదయాత్ర ముగిసిన మురుమూరు వరకు ఆ బాలిక చెప్పులు లేకుండా నడిచి అందరికీ స్ఫూర్తిగా నిలిచింది.

కమిషనర్ ఇంట్లో సోదాలు చేస్తున్న ఎసిబి అధికారులు

మున్సిపల్ కమిషనర్ ఇంట్లో ఎసిబి సోదాలు

ఏక కాలంలో పలు ప్రాంతాల్లో దాడులు

ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు గుర్తింపు

భీమవరం :డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఎసిబి 14400 కాల్ సెంటర్, ఎసిబి యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులతో ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడనే ఆరోపణలతో భీమవరం మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ ఇంటిపై ఎసిబి అధికారులు ఏక కాలంలో ఎసిబి అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. భీమవరం మున్సిపల్ కమిషనర్ క్వాటర్స్, పాలకొల్లు, బాపట్ల, తణుకు, విజయవాడలో సోదాలు నిర్వహించి భారీగా అక్రమ ఆస్తులను ఎసిబి అధికారులు గుర్తించారు. పాలంగి గ్రామం, ఉండ్రాజవరం మండలంలో వ్యవసాయ భూమి 3.03 ఎకరాలు, భీమవరంలో ఒక జి ప్లస్ వన్ భవనం, తణుకులో రెండు జిప్లస్ వన్ భవనాలు, పాలకొల్లులో ఒక జి ప్లస్‌వన్ భవనం, ఒక ఖాళీ నివాస స్థలం, విజయవాడలో రెండు అపార్ట్మెంట్లు ఉన్నట్లు గుర్తించారు. అలాగే కమిషనర్ ఇంట్లో నగదు రూ.20 లక్షలు, 500 గ్రాముల బంగారం, రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనం, విలువైన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా సోదాలు కొనసాగిస్తున్నారు.

ఇమ్యునైజేషన్‌ను మెరుగుపర్చాలి

డిఎంహెచ్‌ఒ మహేశ్వరరావు

కాళ్ల:గ్రామాల్లో ఇమ్యునైజేషన్‌ను మెరుగుపర్చాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిహెచ్‌సికి సంబంధించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తరువాత ఆయన దొడ్డనపూడి గ్రామాన్ని సార్వత్రిక వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని సందర్శించారు. అనంతరం ఫ్యామిలీ డాక్టర్‌ను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.గులాబ్ రాజ్ కుమార్, మానుకొండ విలియం, హింది పాల్సన్ పాల్గొన్నారు.

పవన్‌పై ముద్రగడ వ్యాఖ్యలు సరికావు

పాలకొల్లు:కాపులకు ముద్రగడ పద్మనాభం అంటే ఎంతో గౌరవం, మర్యాద ఉండేదని, అయితే ఆయన పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలతో ఆయన చేసిన ఉద్యమాలు అన్నీ స్వార్థం కోసం చేసినవని భావించాల్సి వస్తోందని పలువురు శ్రీకృష్ణ దేవరాయ కాపు సంఘం నేతలు తెలిపారు. బుధవారం పాలకొల్లు ప్రెస్ కబ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు వంగా నరసింహారావు, ముచ్చర్ల సంజయ్, యర్రంశెట్టి వెంకట రత్నం మాట్లాడుతూ ముద్రగడ పిలుపు ఇచ్చిన ఉద్యమాల్లో పాల్గొన్నామని, అయితే అవన్నీ ఆయన ఒక పార్టీకి కాపు కాసి చేయించుకున్నాయని భావించాల్సి వస్తోందన్నారు. తన ఆదాయాన్ని వదులుకొని ప్రజల కోసం వచ్చిన పవన్ కళ్యాణ్‌ను విమర్శించడం కాపులు తట్టుకోలేక పోతున్నారని చెప్పారు. ముద్రగడ తన వ్యాఖ్యలను ఉపసంహరణ చేసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తాం

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవర్

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవర్ అన్నారు. భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో రూ.22 కోట్లతో నూతనంగా నిర్మించి వినియోగంలో ఉన్న రోడ్డు అండర్ బ్రిడ్జి(ఆర్‌యుబి)ని మంత్రి బుధవారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సబ్ కా సాత్-సబ్ కా వికాస్ సూత్రంతో దేశం ముందడుగు వేస్తోందని చెప్పారు. సమ్మిళిత అభివృద్ధిని సులభతరం చేయడం ద్వారా నిజమైన స్ఫూర్తితో సహకార సమాఖ్యను నిర్ధారిస్తుందన్నారు. ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో భీమవరం జిల్లా ప్రజలకు అందుబాటులోకి, జీవన సౌలభ్యాన్ని మెరుగుపరచడంతోపాటు నగరాన్ని జాతీయ రహదారి నెం.16, 216తో అనుసంధానించడం ద్వారా ఆర్‌యుబి 231 ప్రజలకు పెద్దవరమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. డ్రెయిన్ కెనాల్‌కు ఆనుకుని ఆర్‌యుబి-231 నిర్మాణాన్ని చేపట్టడంతోపాటు ఏడు నెలల రికార్డు సమయంలో దీన్ని పూర్తి చేశామని తెలిపారు. వంద శాతం విద్యుదీకరణతో పాటు అన్నిముఖ్యమైన నగరాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేస్తోందని, రాష్ట్రాలకు మౌలిక సదుపాయాల కేటాయింపులను అనూహ్యంగా పెంచిందన్నారు.

మంత్రి వెంట ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దారు వై.రవికుమార్, రైల్వే అసిస్టెంటు డివిజనల్ ఇంజనీర్ శంకర రామాంజనేయులు, బిజె.నాయకులు, బిహెచ్.శ్రీనివాస వర్మ, పాకా సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమవరం రూరల్:శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగాను అభ్యసించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక విష్ణు కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగా దినోత్సవానికి మంత్రి భారతి ప్రవీణ్ పవార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత విష్ణు కాలేజ్ ఆడిటోరియానికి విచ్చేసిన మంత్రికి కలెక్టర్ ప్రశాంతి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం విష్ణు కళాశాల వ్యవస్థాపకులు బివి.రాజు దంపతుల చిత్రపటాల ముందు పుష్పాలను ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర సహాయ మంత్రి

బార్ అసోసియేషన్ ఎన్నికలకు 38 నామినేషన్లు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఈనెల 30వ తేదీన జరిగే నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేయడానికి మొత్తం 38 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారి, న్యాయవాది పూరిళ్ల శ్రీనివాస్, నిర్వహణ కమిటీ సభ్యులు, న్యాయవాదులు ఉల్లంపర్తి సత్యనారాయణ, కొల్లాటి ఆదినారాయణ తెలిపారు. మొత్తం కార్యవర్గంలోని 15 స్థానాలకు పోటీ జరుగుతుందని తెలిపారు. అధ్యక్ష పదవికి కామన బాల సత్యనారాయణ, చల్లా దానయ్య నాయుడు, చేగొండి మోహన బాలాజీ, తానుకొండ సంతోష్ కుమారి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని తెలిపారు. ఉపాధ్యక్ష పదవికి చదలవాడ జ్ఞానప్రకాష్, గోపిరెడ్డి మణి, నక్కా కుమార్ రత్నం, ప్రధాన కార్యదర్శి పదవికి యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, ఆర్‌జి.కుమార్, విన్నా సూర్య ప్రకాష్‌రావు, రంపా పుల్లాజీ, జాయింట్ సెక్రటరీ పదవికి కురెళ్ల సోమశేఖర్, గోడి సత్యనారాయణ, సోడదాసి శ్రీధర్, కొప్పినీడి చిట్టి పద్మజ, కోశాధికారి పదవికి దొంగ సుభాష్ బాబు, బళ్ల శ్రీహరి, ఆర్.జి.కుమార్, కొప్పినీడి చిట్టి పద్మజ నామినేషన్ వేశారు. లైబ్రరీ కార్యదర్శి పదవికి నారిన శ్రీనివాసరావు, బళ్ల శ్రీహరి, కొప్పినీడి చిట్టి పద్మజ, క్రీడలు, సాంస్కృతిక వ్యవహారాల కార్యదర్శి పదవికి సోడదాసి శ్రీధర్, కొప్పినీడి చిట్టి పద్మజ, మహిళా ప్రతినిధి పదవికి కుంచే దుర్గా భవాని తదితర పదవులకు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని తెలిపారు. నామినేషన్ పత్రాల ఉపసంహరణకు ఈనెల 24వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు గడువు ఉందని వారు వివరించారు.

దరఖాస్తులు చూపుతున్న అన్నదాతలు, నేతలు

రైతులకు నష్టపరిహారమందించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

దాళ్వాలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొత్తూరు రామరాజు డిమాండ్ చేశారు. బుధవారం నవుడూరు వానిగురువులో పంట మునిగింది పరిహారం ఇవ్వండి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ఈ ప్రభుత్వం పండించిన పంటకు సరైన ధర ఇవ్వక అన్నదాతలను అవస్థలు పెడుతుందని విమర్శించారు. రవాణా ఖర్చులు, తేమ శాతం అని ముక్క విరిగిందని, ధాన్యం కొనుగోలు చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు 25 వేల రూపాయలు చొప్పున నష్టం వాటిల్లుతోందని, పండించిన రైతు పరిస్థితి ఏంటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొగల్తూరు మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, పెచ్చేటి నాగేశ్వరరావు, చింతపల్లి చిన్న బాలకృష్ణ, గూడూరి బోసు, పాల రాంబాబు, గొంది రాజు, కలిదిండి కుమార్ బాబు పాల్గొన్నారు.

సత్యనారాయణ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి సీనియర్ నాయకులు, మావుళ్లమ్మ దేవస్థానం మాజీ ఛైర్మన్ కొట్టు సత్యనారాయణ బాబు మృతి పార్టీకి తీరనిలోటని పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, డ్వాక్రా అంగన్‌వాడీ సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేరగాని నారాయణమ్మ, రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్ ఉన్నారు.

ఉపాధ్యాయులను సత్కరించిన సభ్యులు

ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

దేశ భవిష్యత్తును నిర్దేశించే విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఎంఇఒ - 1 ఎ.రవీంద్ర అన్నారు. జువ్వలపాలెం గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పనిచేసి బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు ఆత్మీయ అభినందన సత్కారం బుధవారం నిర్వహించారు. ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు మాట్లాడుతూ జువ్వలపాలెంలో పెద్దలు పాఠశాల అభివృద్ధికి చేసే కషి అభినందనీయమన్నారు. గ్రామపెద్ద గోకరాజు వినోద్ బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గ్రేడు-2 హెచ్ఎం వి.త్రినాథులు, ఉపాధ్యాయులు శర్మ, సునీత, రవీంద్ర కుమార్, స్వామి, వరలక్ష్మి, వర్మను సత్కరించారు.

టిడిపి కార్యాలయంలో వెంకటేశ్వరరాజును సన్మానిస్తున్న నేతలు

తాపీ పనివార్ల సంక్షేమ సంఘానికి సహకారం

ప్రజాశక్తి - ఆకివీడు

తాపీ పనివారికి సహకరించాలనే లక్ష్యంతో ఈ సహకారం అందజేశానని టిడిపి ఉండి మండల నాయకులు పుత్తూరి వెంకటేశ్వరరాజు అన్నారు. వెంకటేశ్వరరాజు స్థానిక మండల తాపీ పనివార్ల సంక్షేమ సంఘానికి 50 వేల రూపాయల నగదు అందజేశారు. ఆయనను సంఘ సభ్యులు, పార్టీ నాయకులు బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. మండల అధ్యక్షులు మోటుపల్లి రామ వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వాణిజ్యభాగం ఉపాధ్యక్షులు గోంట్ల గణపతి, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి ఇల్లాపు అప్పారావు, బోలా శేషు, బత్తుల రవీంద్ర షేక్ నాగూర్, బి.వెంకట్రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుగొండలో జన్ భాగిదారి

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండలో అంగన్‌వాడీ కేంద్రంలో జన్ భగిదారీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి మాట్లాడారు. ఐదో సంవత్సరాలు నిండిన విద్యార్థులను తల్లిదండ్రులు ఎలిమెంటరీ స్కూల్‌కు పంపించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 సంవత్సరం నుండి పిల్లలకు ఆటలు పాటలు, విద్యా బోధన నేర్పిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లలో నాణ్యమైన విద్యాబోధన నేర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యుఎపిఎస్ అధికారి కుసుమ, సరస్వతి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు శ్రీదేవి ట్రస్ట్ సాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ పేద ప్రజలకు విశేష సేవలందిస్తోందని ట్రస్ట్ వ్యవస్థాపకులు దాట్ల వెంకట్రామరాజు అన్నారు. కాళ్లకూరు గ్రామం హరిజన పేటకు చెందిన దావులూరి యేసు రత్నం (77), పోరపాటి వెంకటరత్నం(82) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ట్రస్ట్ వ్యవస్థాపకులు దాట్ల వెంకట్రామరాజు తన వంతు సాయంగా ఒక్కో కుటుంబానికి రూ.5 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాధు శ్రీను, ఈదా మోసేస్, ఈదా యోసేపు, మాండ్రు జాన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ట్రాన్స్‌ఫార్మర్ వేశారు.. కంచె మరిచారు..!

రక్షణ కంచె లేకపోవడంతో స్థానికుల ఆందోళన

ప్రజాశక్తి - ఉండి

మండల కేంద్రమైన ఉండి శివాలయం వీధిలో కూనపరాజు అప్పలరాజు సీతమ్మ లయన్స్ కళ్యాణ మండపం ఎదురుగా విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అయితే చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయడం మరిచారు. ట్రాన్స్‌ఫార్మర్ ఎదురుగా కళ్యాణ మండపం ఉండడం వల్ల కళ్యాణ మండపంలోకి వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడం వల్ల కళ్యాణ మండపానికి వచ్చేవారు వాహనాలను నిలుపుదల చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా ఆదమరిస్తే అటువైపు వెళ్తే ప్రమాదమని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ గడ్డి, పిచ్చిమొక్కలు మొలిచాయి. అయితే ఇటీవల స్థానిక రైతు ముదునూరి అప్పలరాజుకు చెందిన గేదె గడ్డిని మేస్తూ దాని కొమ్ములు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో చనిపోయింది. దీంతో రైతు అప్పలరాజు లబోదిబోమన్నాడు. విద్యుత్ శాఖాధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి కంచె ఏర్పాటు చేయకపోవడం సరికాదని స్థానికులు విమర్శిస్తున్నారు. గేదె కాబట్టి సరిపోయింది, అదే మనిషి అయితే పరిస్థితి ఏంటని వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె వేయాలని కోరుకుంటున్నారు.

విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదె



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ వేయని రక్షణ కంచె

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : డిఇఒ

ప్రజాశక్తి - భీమవరం

యోగాను ప్రతి ఒక్కరూ ఆచరించి ఆరోగ్యవంతులు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం సిఎస్ఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన యోగా సెంటర్‌ను డిఇఒ ప్రారంభించి మాట్లాడారు. యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతతతోపాటు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ప్రముఖ మానసిక వైద్యులు జివి.రమణారావు మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు యోగ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కళాశాల సెక్రటరీ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. వివిధ పోటీల్లో గెలుపొందిన 62 మందికి బహుమతులు అందజేశారు. అనంతరం యోగ గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బొమ్మదేవర ప్రభాకర్, జిపిసి శేఖర్ రాజు, పి.రామబద్రి రాజు, కలిగొట్ల గోపాలశర్మ, మేడిద మాణిక్యాలరావు పాల్గొన్నారు.

భీమవరం : విద్యార్థులతో డిఇఒ రమణ, కళాశాల యాజమాన్యం

కాళ్ల: యోగా వల్ల ఉపయోగాలు ఎన్నో ఉన్నాయని కలవపూడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జె.సీతారామ్మూర్తి తెలిపారు. కలవపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ జి.శ్రీనివాస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సీతారామ్మూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల మొదటి అసిస్టెంట్ ఎస్ఎస్.సత్యనారాయణ, సిహెచ్ జోసెఫ్ రాజు, స్వామి, శివాజీ, లతా రాణి పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు క్షత్రియ కళ్యాణ మండపంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పతాంజలి యోగా సాధన సమితి, క్షత్రియ సంక్షేమ పరిషత్, సరస్వతి విద్యాసంస్థలు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు జవ్వాజీ కళ్యాణ్‌ను సత్కరించారు. అలాగే ఆర్యవైశ్య భవనంలో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘ జాతీయ వసతి ఛైర్మన్ కారుమూరి సూర్యనారాయణ పాల్గొన్నారు. పాలకొల్లు కోర్టు ఆవరణలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వరలక్ష్మి మాట్లాడుతూ యోగా దైనందిన జీవితంలో భాగం కావాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తలుపుల శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ వేదాల నాగరాజు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : యోగాతో చక్కని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. నిట్ లోని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రాంగణంలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యోగా ద్వారా ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. అనంతరం యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ జిబి వీరేష్ కుమార్, ఆచార్యులు వి.సందీప్, కిరణ్ తీపర్తి విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే బార్ అసోసియేషన్ కార్యాలయంలో యోగా దినోత్సవం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు మాట్లాడారు. చినతాడేపల్లిలోని శ్రీ చైతన్య ఒలంపియాడ్ పాఠశాలలో యోగాసనాలు వేశారు. అనంతరం మూడు దశల్లో జరిగిన పోటీలలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

శ్రీ వాసవీ ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కళాశాల నుండి పెదతాడేపల్లి రోడ్డు వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్, బిఎస్‌హెచ్ విభాగాధిపతి ఎన్.రాజశేఖర్ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ సైనికాధికారి డి.వెంకటేశ్వరరావు యోగా ఆవశ్యకతను వివరించి, పలు యోగా ఆసనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల పాలక వర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, కోశాధికారి బాల కాశయ్య, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు పాల్గొన్నారు.

తణుకురూరల్ : మితాహారం ద్వారా అనేక సమస్యలు పోగొట్టుకోవచ్చని యోగా ట్రైనర్ వర్రే చలపతి గురూజీ తెలిపారు. స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్రే చలపతి మాట్లాడారు. అనంతరం యోగా డిప్లమా పూర్తి చేసిన విద్యార్థినులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో వివేకానంద గ్లోబల్ స్కూల్ సెక్రటరీ చిట్టూరి రీనాసాయి, యోగా ఆచార్యులు అబ్బులు చౌదరి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బిహెచ్ హిమబిందు పాల్గొన్నారు.

వీరవాసరం : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. సబ్బారపు వెంకట్రావు అండ్ కమల ఛారిటబుల్ ట్రస్టు, వాకర్‌క్లబ్, వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉపాధ్యాయుడు బాజింకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు శనివారపు ప్రసాద్, సబ్బారపు వెంకట్రావు, కెవిడి, ప్రసాద్ పాల్గొన్నారు.

పెనుమంట్ర : మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని వ్యవసాయ పాలిటెక్నిక్‌లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎడిఆర్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వ్యవసాయ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపల్ కెఎం.దక్షిణామూర్తి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్రీనివాస్, శాస్త్రవేత్త వి.భువనేశ్వరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట : సహజ యోగా ద్వారా రోగాలు దరి చేరవని పెనుమంచిలి మెయిన్ పాఠశాల ఉపాధ్యాయులు కెవివి తాతారావు అన్నారు. ఆ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు యోగా క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యసనాలకు దూరంగా ఉండేందుకు విద్యార్థుల్లో సుజనాత్మకత పెంపొందేందుకు యోగా ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నరసాపురం వైఎన్ కాలేజీలోని యోగా కేంద్రంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి యోగా క్లాసులు నిర్వహించారు. పదో అదనపు జిల్లా న్యాయమూరి విజయదుర్గ మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్ పాల్గొన్నారు.

ఆకివీడు : మాదివాడ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులకు యోగా పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొదటి బహుమతి ఎస్‌కె.తహసీన్, రెండో బహుమతి గాయత్రి గెలుచుకున్నారు. విజేతలకు కార్యక్రమ నిర్వాహకులు దాసరి వెంకట సత్యనారాయణ, నెల్లూరు సతీష్‌కుమార్, నగర పంచాయతీ వైస్ ఛైర్ పర్సన్ పుప్పాల సత్యనారాయణ, గ్రంథ పాలకురాలు పార్వతి బహుమతులు అందజేశారు. యోగా విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని, విజ్ఞానాన్ని పెంచుతాయని వివిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిపిడిసి కార్యదర్శి, పతంజలి యోగా కేంద్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బలరాం ప్రతాప్‌కుమార్ అన్నారు. దుంప గడపలో వివిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వోగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రతాప్ కుమార్ పాల్గొని మాట్లాడారు.

ఉండి : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందొచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ పంజా ధర్మతేజ అన్నారు. బుధవారం ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా పంజా ధర్మ తేజ మాట్లాడుతూ ఎవరైతే ప్రతిరోజూ యోగా సాధన చేస్తారో వారు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.సాయి చంద్ర, పిహెచ్ఎన్ కుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : వైఎన్‌లో యోగా చేస్తున్న అధ్యాపకులు

ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలి

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందించి ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. వల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇఒపిఆర్‌డి టి.మూర్తిబాబు ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులకు, గ్రామ వాలంటీర్లకు జగనన్న సురక్షపై శిక్షణ తరగతులు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సుంకర నేలపూడి బేబీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి టి.మూర్తిబాబు మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో ప్రజలకు అందించే సేవలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం జగనన్న సురక్ష కార్యక్రమంలో 9 సేవలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుండి గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో చర్యలు చేపట్టాలన్నారు. ధ్రువీకరణ పత్రాలు పథకాలకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జివివి.సత్యనారాయణ, విఆర్‌ఒ నాగేశ్వరరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఎంసి ఛైర్మన్ లావణ్య

మోటార్ సైకిళ్ల చోరీ కేసులో ఐదుగురు అరెస్టు

వారిలో ముగ్గురు బిటెక్ విద్యార్థులు - 16 బైక్‌లు స్వాధీనం

ప్రజాశక్తి - కాళ్ల

ఓ ప్రముఖ కాలేజీలో ఉన్నత చదువులు చదువుతూ విలాసాలకు, వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు బిటెక్ విద్యార్థులు, మరో ఇద్దరు యువకులు పోలీసులకు పట్టుబడిన సంఘటన కాళ్ల మండలంలో చోటుచేసుకుంది. భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ బుధవారం సాయంత్రం కాళ్ల పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇటీవల జిల్లాలో మోటార్ సైకిళ్ల దొంగతనాలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు వాటిని ఛేధించేందుకు ప్రత్యేక బృందాలుగా గ్రస్తీలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం ఉదయం ఏలూరుపాడు చెక్ పోస్ట్ దగ్గర కాళ్ల పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా ముగ్గురు విద్యార్థులు, ఇద్దరు యువకులు పోలీసులను చూసి కంగారుపడుతూ పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. భీమవరం మండలం కొత్తపూసలమర్రుకు చెందిన బస్వాని యశ్వంత్ వెంకట ధర్మతేజ, అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామానికి చెందిన ఇంజేటి అనిష్, పెనుగొండ గ్రామానికి చెందిన బుర్రా అనిల్ కుమార్, భీమవరానికి చెందిన గుదివిందల సోమేశ్వరరావు, బోను మోజేష్ ఒక టీంగా ఏర్పడి మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ విచారణలో పశ్చిమగోదావరి, కృష్ణా, ఏలూరు జిల్లాల పరిధిలోని కాళ్ల, కలిదిండి, గణపవరం, ముదినేపల్లి, ఏలూరు టూటౌన్, బంటుమిల్లి, కృత్తివెన్ను, కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్లో పరిధిలో ఇటీవల చోరీకి గురైన 16 మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ.11 లక్షల 53 వేలు ఉంటుందన్నారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన ఆకివీడు సిఐ జి.గీతా రామకృష్ణ, కాళ్ల ఎస్ఐ ఎజిఎస్ మూర్తి, ఎఎస్ఐ రామరాజు, కానిస్టేబుల్స్ రాజేష్, సుధాకర్, ఉమా మహేశ్వరరావు, రవికుమార్ డిఎస్‌పి శ్రీనాథ్ అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీనాథ్

పంటసాగు హక్కు పత్రాలపై అవగాహన

ప్రజాశక్తి - వీరవాసరం

కౌలు రైతులందరూ సకాలంలో పంట సాగు హక్కు పత్రాలు పొంది, ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి చికిలే మంగతాయారు తెలిపారు. పంట సాగు హక్కు పత్రాలపై అవగాహనా సదస్సు బుధవారం వీరవాసరం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్న ఈ సదస్సులో పంటసాగు హక్కు పత్రాలు పొందే విధానం పై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు మాట్లాడుతూ 11 నెలల కాల పరిమితితో ఈ హక్కు పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. హక్కు పత్రాలు పొందిన రైతులు రాయితీతో అందించే ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలతో పాటు తాము పండించిన పంటను అమ్ముకోవడానికి వెలుసుబాటు ఉంటుందన్నారు.

మోడీది రాక్షస పాలన : సిపిఐ

ప్రజాశక్తి- తణుకు

మతతత్వ కార్పొరేట్ విధానాలతో దేశంలో అరాచక పాలన సాగిస్తున్న నరేంద్ర మోడీ పాలనకు చమర గీతం పాడాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక వంకా సత్యనారాయణ భవనంలో నిర్వహిస్తున్న సిపిఐ జిల్లా రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులు రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ అధికారం చేపట్టి నాటినుండి లక్షల కోట్ల విలువచేసే ప్రభుత్వ రంగ సంస్థలను అదాని, అంబానీలకు కారు చౌకగా విక్రయిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రాక్షస పాలన కొనసాగుతోందని విమర్శించారు. కార్యకర్తలు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి కోనాల భీమవరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని రామారావు, నాయకులు నెక్కంటి సుబ్బారావు, టి.అప్పలస్వామి, సిహెచ్ రంగారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు, బంగారు పతకాలు అందజేసిన యాజమాన్యం

ఉన్నత విద్యా ప్రమాణాలే కళాశాల లక్ష్యం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఉన్నత విద్యా ప్రమాణాలను విద్యార్థులకు అందించడమే తమ కళాశాల ధ్యేయమని ఆంధ్ర అసోసియేషన్ (యుకె) కళాశాల పాలకవర్గం అధ్యక్షుడు తేతలి గురెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ తమనంపూడి రామారెడ్డి తెలిపారు. కళాశాలలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిసి విభాగంలో 959 మార్కులు సాధించిన కె.కావ్యశ్రీ, సిఇసి విభాగంలో 895 మార్కులు సాధించిన కోమటి దుర్గకు బంగారు పతకాలు అందజేశారు. అదేవిధంగా ఎంపిసి, సిఇసి విభాగంలో ద్వితీయ స్థానం వచ్చిన విద్యార్థులకు వెండి పతకాలు అందజేశారు. అలాగే జూనియర్ ఇంటర్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు తేతలి వీర రాఘవరెడ్డి ఫౌండేషన్ తరపున మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపక బృందం, విద్యార్థులు, పాలకవర్గం పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ఫ్యాన్ అందజేత

ప్రజాశక్తి - పెంటపాడు

వెలగలపేరెడి పదమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు వి.రామచంద్రరెడ్డి పెంటపాడు శాఖ గ్రంథాలయానికి సీలింగ్ ఫ్యాన్ అందజేశారు. గ్రంథాలయం అవసరాలను గుర్తించి ఫాన్ అందజేసిన దాతలకు ధన్యవాదాలు తెలిజేశారు. వారి పేర్ల జాబితాను గ్రంథాలయంలో ప్రదర్శిస్తామని గ్రంథాలయ అధికారి జుల్ఫిఖర్ అలీ తెలిపారు.

ఫ్యాను అందజేస్తున్న దాత

డాక్యుమెంట్సు పోయినవి

ఏలూరు జిల్లా, భీమడోలు మండలం, పూళ్ళ గ్రామ కాపురస్తులు అయిన మాకాని వెంకట హరిబాబు, S/o. నాగేశ్వరరావు అను నాకు S.R.O., భీమడోలు **డాక్యుమెంట్సు నెంబరు 3350/1960** అనే డాక్యుమెంట్సు పట్టుకొని భీమడోలు రిజిష్టర్ ఆఫీసుకు వెళ్ళి తిరిగి పూళ్ళ గ్రామంనకు వెళ్ళుచుండగా భీమడోలు రిజిస్ట్రార్ ఆఫీసు పరిధిలో దస్తావేజు ఉన్న కవరు పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. కావున ఈ దస్తావేజులు (ఆస్తి పత్రాలు) దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియచేయవలసిందిగా కోరుచున్నాము.

మాకాని వెంకట హరిబాబు
S/o. నాగేశ్వరరావు
పూళ్ళ, భీమడోలు మండలం
సెల్: 98662 79459